క్లుప్తంగా

సప్తనదీ జలాల్లో ప్రత్యేక పూజలు



రాజశ్యామలాదేవి విగ్రహానికి కృష్ణాజలాలతో అభిషేకం చేస్తున్న ఆలయ పురోహితులు

కొత్తపల్లి: మండలంలోని సప్తనది సంగమేశ్వరం వద్ద ఎగువ పుష్కర ఘాట్ వద్ద సప్తనదీ జలాలలో ఆలయ పురోహితుడు తెలకపల్లి రఘురామ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం శ్యామలాదేవి నవరాత్రుల్లో మొదటిరోజు మాఘశుద్ధ పాఢ్యమి గురువారం సప్తనదుల సంగమంలో శ్రీ రాజశ్యామలాదేవి విగ్రహానికి విశేష పూజక్రతులు చేశారు. అమ్మవారికి శ్రీ దుర్గాసూక్త, శ్రీ సూక్త విధానంలో అభిషేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా సూర్యనారాయణ స్వామికి అర్ఘ్యములు, విశేష పూజలు చేశారు.

క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్తు



ఎస్‌ఐ తిరుపాల్‌ను సన్మానిస్తున్న వడ్డెమాన్ జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయ బృందం

నందికొట్కూరు: క్రీడలతోనే క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని బ్రాహ్మణకొట్కూరు ఎస్‌ఐ తిరుపాల్ అన్నారు. గురువారం మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐ దత్తత తీసుకున్న వడ్డెమాన్ జెడ్పీ హైస్కూల్ అభివృద్ధి, క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు కావాల్సి ఏర్పాట్లపై హెచ్‌ఎం, ఎస్‌ఎంసీ చైర్మన్ మహమ్మద్ హుసేన్, ఉపాధ్యాయ బృందంతో చర్చించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ జిల్లా పరిషత్ పాఠశాల అభివృద్ధికి చేయూతనిస్తామన్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయలు కల్పించేందుకు తమవంతు సహాయక సహకారం అందిస్తానని చెప్పారు. ఎస్‌ఐ తిరుపాల్‌ను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

ఉద్యాన పంటల సాగుతో లాభాలు



మండ్లెంలో ఉల్లినిల్వ గోదాము షెడ్డును పరిశీలిస్తున్న ఉద్యానవనశాఖ అధికారిణి తేజస్విని

జూపాడుబంగ్లా: రైతులు ఉద్యానవన పంటలు సాగుచేసుకోవడం వల్ల తక్కువ పెట్టుబడితో అధికలాభాలు ఆర్జించవచ్చునని నందికొట్కూరు హార్టికల్చర్ అధికారిణి తేజస్విని అన్నారు. గురువారం మండలంలోని మండ్లెం గ్రామంలో ఉల్లినిల్వ గోదాముల నిర్మాణంపై రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ 25టన్నుల ఉల్లి నిల్వ సామర్థ్యం ఉన్న గోదాము నిర్మాణానికి రైతులకు ప్రభుత్వం 50శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే జామ, బొప్పాయి, డ్రాగన్ ఫ్రూట్స్, దానిమ్మ, చిని, నిమ్మ తదితర పండ్లతోటలు పెంచుకొనే రైతులకు సబ్సిడీ ఇస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

పశువులు ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలి

పాములపాడు: పశువులు నిత్యం ఆరోగ్యంగా ఉండేలా జాగ్రత్తగా చూసుకోవాలని పశువైద్యాధికారి భాస్కర్ అన్నారు. గురువారం మండలంలోని బానకచెర్ల గ్రామంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 30 ఎద్దులు, 10 గేదెలు, 40 దూడలు, 1000 గొర్రెలు, 240 కోళ్లకు నట్టల నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచు నరసింహులు, వీహెచ్‌ఏలు ప్రసన్న, కరిముల్లా, చాందిని, గోపాల మిత్ర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలి

కొత్తపల్లి: సీసీ రోడ్డును నాణ్యతగా నిర్మించాలని సర్పంచు జమిలాబీ, మండల మాజీ ఉపాధ్యక్షుడు మహబూబ్ బాషా సూచించారు. గురువారం ముసలిమడుగు గ్రామంలోని మైనార్టీ, బీసీ కాలనీలలో వేస్తున్న సీసీ రహదారులను పరిశీలించారు. గ్రామంలోని మైనార్టీ కాలనీలో జెడ్పీ నిధుల కింద రూ. 5 లక్షలు, బీసీ కాలనీలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల నుంచి రూ.7 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

జూపాడుబంగ్లా: జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకొని కందులు, శనగల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయించాలని సీపీఎం నాయకులు పక్కీర్‌సాహెబ్, ఎం.కర్ణ, గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం వారు మండలంలోని పారుమంచాల గ్రామంలో రైతులు నూర్పిడి చేసుకుంటున్న కందులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకంటే బహిరంగ మార్కెట్లో ధర తక్కువగా ఉన్నందున వెంటనే ప్రతి మండల కేంద్రంలో కందులు, శనగల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు స్వాములు, జాకీర్, లింగన్న, బాషా పాల్గొన్నారు.

ప్రసవవేదన!

- జూపాడుబంగ్లా పీహెచ్‌సీలో ప్రసవాలకు నోచుకోని గర్భిణులు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆసుపత్రిలో ఆధునిక వసతుల కల్పన
- అయినా కాన్పులు చేయని వైనం
- నందికొట్కూరు, కర్నూలుకు వెళ్లాల్సిన పరిస్థితి



ప్రసవాలకు నోచుకోని జూపాడుబంగ్లా ప్రాథమిక ఆరోగ్యకేంద్రం

జూపాడుబంగ్లా: ప్రభుత్వ పీహెచ్‌సీ, సీహెచ్‌సీలలో గర్భిణులకు సుఖప్రసవాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించినా జూపాడుబంగ్లా పీహెచ్‌సీలో మాత్రం ప్రసవాలు నిర్వహించడంలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాడు–నేడు కింద ఆసుపత్రిలో ఆధునిక వసతులు కల్పించినా కాన్పులు మాత్రం చేయడం లేదు. దీంతో మండల పరిధిలోని గర్భిణులు వ్యయప్రయాసలకోర్చి నందికొట్కూరు, కర్నూలు ఆసుపత్రులకు లేదా ప్రైవేటు ఆసుపత్రులను వెళ్లాల్సి వస్తోంది.

నిబంధనలు బేఖాతర్

ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో నెలకు కనీసం ఐదు సుఖప్రసవాలు నిర్వహించాలనే నిబంధనలున్నా వైద్యుల నిర్లక్ష్యం వల్ల జూపాడుబంగ్లా పీహెచ్‌సీలో ప్రసవాలు చేయకపోవటంతో గర్భిణులు ప్రసవ సమయంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని మారుమూల గ్రామాల్లోని గర్భిణులు నందికొట్కూరు, కర్నూలు ప్రాంతాల్లోని ఆసుపత్రులకు పరుగులు తీయాల్సి వస్తోంది. అన్నిరకాల వసతులున్నా వైద్యులు ప్రసవాలు చేయకపోవటం ఏమిటని మండలంలోని వివిధ గ్రామాల మహిళలు ప్రశ్నిస్తున్నారు.

గర్భిణుల ప్రసవవేదనను దృష్టిలో పెట్టుకొని ఇప్పటికైనా జూపాడుబంగ్లా, పారుమంచాల పీహెచ్‌సీలో సుఖప్రసవాలుచేసేలా జిల్లా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని మండలంలోని వివిధ గ్రామాల మహిళలు కోరుతున్నారు.



ఆరోగ్యకేంద్రంలో ప్రసవాలు చేసేందుకు ఏర్పాటుచేసిన ప్రత్యేక గది

పరికరాలు లేవు

జూపాడుబంగ్లా పీహెచ్‌సీలో ప్రసవాలు చేసేందుకు తగిన పరికరాలు లేవు. అందుకోసమే ప్రసవాలు చేయడంలేదు. అవసరమైన పరికరాల కోసం జిల్లా వైద్యధికారి వెంకటరమణకు ప్రతిపాదనలు పంపాం. అయినా ఇంతవరకూ మంజూరు కాలేదు. పరికరాలు వస్తే ప్రసవాలు చేస్తాం.

– డాక్టర్ గంగాధర్, వైద్యాధికారి, జూపాడుబంగ్లా పీహెచ్‌సీ

వైఎస్సార్‌సీపీ హయాంలో ఆసుపత్రి ఆధునీకరణ

మండలంలో జూపాడుబంగ్లా, పారుమంచాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలున్నాయి. అయితే వాటిలో గర్భిణులకు వైద్యులు సుఖప్రసవాలు చేయడంలేదు. మండల ప్రజలకు మెరుగైన చికిత్సలు అందించాలనే ఉద్దేశంతో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు కింద రూ.1.80కోట్లతో ఆధునిక వసతులతో ఐదు పడకల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని జూపాడుబంగ్లాలో నిర్మించారు. పీహెచ్‌సీలో సుఖ ప్రసవాలు నిర్వహించేలా సౌకర్యాలు కల్పించారు. ప్రత్యేకంగా లేబర్‌రూంను కూడా నిర్మించారు.

ప్లాస్టిక్ వస్తువులు విక్రయించరాదు

శ్రీశైలంప్రాజెక్ట్: మహాశివరాత్రి సందర్భంగా అటవీ ప్రాంతంలో తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసుకునేవారు ప్లాస్టిక్ వస్తువులను విక్రయించరాదని అటవీశాఖ శ్రీశైలం రేంజ్ అధికారి పి.సుభాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెచ్చెర్వు, దామర్లకుంట, తాపాలరస్తా, మఠంబావి, భీమునికొలను తదితర ప్రాంతాలలో భక్తులకు ప్లాస్టిక్‌లో ఉంచిన ఘన, ద్రవ పదార్థాలు విక్రయించరాదన్నారు.

నేడు కోఆర్డినేషన్ సమావేశం

మహానంది: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలపై శుక్రవారం కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ నంద్యాల ఆర్‌డీఓ కార్యాలయంలో ఆర్‌డీఓ విశ్వనాథ్ ఆధ్వర్యంలో మొదటి సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కేసు నమోదు

కొత్తపల్లి: యువకుడిని కొట్టిన ఘటనపై ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎం.కేశవ గురువారం తెలిపారు. మండలంలోని కొక్కెరంచ గ్రామానికి చెందిన అచ్చుగట్ల చరణ్ అనే యువకుడు అదే గ్రామానికి చెందిన ఓ అమ్మాయితో ఫోన్లో మాట్లాడాడనే నేపంతో అమ్మాయి తరుపు బంధువులు సుధాకర్, రమణ ఈతరెమ్మలతో కొట్టారు. దీంతో చరణ్‌కు గాయాలు కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఇద్దరిపై కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వెల్లడించారు.

అండర్ పాస్ ఎత్తు పెంచాలని రిలే దీక్ష



రిలే నిరాహార దీక్షలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా నాయకుడు రాజశేఖర్

పాములపాడు: పాములపాడు–చెలిమిల్ల గ్రామాల మధ్య నేషనల్ హైవే 340సీ నిర్మాణ పనుల్లో భాగంగా చేపట్టిన అండర్‌పాస్ వంతెన ఎత్తు పెంచాలని డిమాండ్ చేస్తూ గురువారం పని ప్రదేశంలో రైతులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. రైతు సంఘం జిల్లా నాయకులు రాజశేఖర్ మాట్లాడుతూ ఈ వంతెన మార్గంలో పాములపాడు, కొత్తపల్లి మండలాలకు చెందిన సుమారు 23 గ్రామాల ప్రజల రాకపోకలు సాగిస్తారన్నారు. అంతే కాకుండా రైతులు పండించిన పంట ధాన్యాలను కూడా తరలిస్తాన్నారు. వంతెన ఎత్తు తక్కువగా ఉన్నందున వాహనాల రాకపోకలతో పాటు ధాన్యం తరలింపునకు ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. వంతెన ఎత్తు పెంచటంతో పాటు సర్వీసు రోడ్డు కూడా నిర్మాణం చేపట్టాలని కోరారు. దీక్షలో చెలిమిల్ల ఎంపీటీసీ సభ్యుడు సురేష్, సర్పంచు కోట్ల చంద్రారెడ్డి, లింగాల సర్పంచు మల్లీశ్వరరెడ్డి, కో ఆప్టెడ్ ముర్తుజావలి, రైతు సంఘం నాయకులు వెంకటేశ్వరరావు, బాలయ్య, రమణ, నారాయణ, రాజు, స్వామన్న, వైఎస్సార్‌సీపీ, కాంగ్రెస్, జనసేన, సీపీఎం, టీడీపీ పార్టీలకు చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

రిలే నిరాహార దీక్షశిబిరానికి తహసీల్దార్ సుభద్రమ్మ, ఎస్‌ఐ సురేష్‌బాబు చేరుకున్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ అండర్ పాస్ వంతెన ఎత్తు పెంచడం, సర్వీసు రోడ్డు నిర్మాణం తదితర సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, రిలే నిరాహార దీక్ష ఉపసంహరించుకోవాలని కోరారు. ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వచ్చే వరకు పనులు నిలిపివేయాలని కంపెనీ సిబ్బందికి తెలిపారు. దీంతో దీక్షను ఉపసంహరించుకున్నారు.

4న జాబ్ మేళా

నందికొట్కూరు: వచ్చే నెల 4వ తేదీన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తునట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా కరపత్రాలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. సునీతతో కలసి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ జాబ్‌మేళాలో రెండు కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన వారు అర్హులని చెప్పారు. కార్యక్రమంలో స్కిల్ కో ఆర్డినేటర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించండి

వెలుగోడు: వెలుగోడు ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం కింద తీసుకున్న రుణాలు రైతులు సకాలంలో చెల్లించాలని సొసైటీ సీఈఓ జంబులయ్య కోరారు. గురువారం ఆయన సొసైటీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వెలుగోడు ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘంలో పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు, మధ్య కాలిక రుణాలు, గ్రూప్స్, పర్సనల్ లోన్స్, తనఖా లోన్లను ప్రతి సభ్యుడు ఫిబ్రవరి నెలాఖరులోపు చెల్లించాలని ఆయన సూచించారు. రుణాలు చెల్లించిన వారు మళ్లీ లోన్ పొందవచ్చు అన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేద్దాం

పాములపాడు: నెల్లూరులో ఈ నెల 27న నిర్వహించే సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలకు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి స్వామన్న పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రోజు రోజుకు పెరుగుతున్న ధరలు, అదనపు చార్జీలు, బాలికలపై హత్యాచారాలు, బెల్టు షాపులతో విచ్చల విడి మద్యం, డ్వాక్రా గూపులకు వడ్డీ రాయితీలు, ఇళ్ల స్థలాలు సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు వెంకటేశ్వరరావు, బాలయ్య రాజు, రంగస్వామి, బాల ఏసు తదితరులు పాల్గొన్నారు.

5న నిరసన కార్యక్రమాలు

ఆత్మకూరు: బీజేపీ ప్రభుత్వం నిరంకుశంగా పార్లమెంట్‌లో చర్చ లేకుండా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 5న పట్టణంలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వి.యేసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్ తెలిపారు. గురువారం పట్టణంలోని ధనుంజయ సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వరంగ పరిశ్రమలను కారు చౌకగా కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయడం..వారికి అనుకూలమైన లేబర్ కోడ్‌లను ఏప్రిల్ నుంచి అమలులోకి తీసుకొని వచ్చే ప్రయత్నాలు విరమించుకోవాలన్నారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు మంజుల, ప్రభావతి, నాగరాజు, తిమ్మయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

వెలుగోడు: మండల పరిధిలోని మోత్కూరు గ్రామానికి చెందిన బాధిత రైతు కుటుంబానికి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి రూ. 2 లక్షలు చెక్కును అందజేశారు. గత ఏడాది జూలై నెల 9వ తేదీన మోత్కూరు గ్రామానికి చెందిన పి శేఖర్ రెడ్డి ప్రమాదంలో మతి చెందాడు. వెలుగోడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో రుణం తీసుకున్న ప్రతి సభ్యునికి జనతా ఇన్సూరెన్స్ పాలసీ వర్తిస్తుంది. ఈ మేరకు బాధిత కుటుంబానికి మంజూరైన పరిహారానికి సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే బుడ్డా తన స్వగృహంలో అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ జంబులయ్య, క్లర్క్ సురేష్ రెడ్డి, నాయకులు ఎం సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ స్కూళ్లను స్వాధీనం చేసుకోవాలి

నందికొట్కూరు: చైతన్య, నారాయణ తదితర కార్పొరేట్ స్కూళ్లను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని పీడీఎస్‌యూ డివిజన్ అధ్యక్షుడు మహబూబ్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చైతన్య, నారాయణ స్కూల్స్‌లో విద్యార్థులు మానసిక ఒత్తిడితో పిట్టల్లా నేల రాలుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఒక స్కూల్‌కు పర్మిషన్ తీసుకొని రెండు, మూడు స్కూల్స్‌ను నడుస్తున్నా జిల్లా విద్యాశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో పీడీఎస్‌యూ నాయకులు జగదీష్, శ్యామ్ నాయక్, అశోక్, సాగర్, వేణు, జగన్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు: వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే జయసూర్య అధికారులను ఆదేశించారు. గురువారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం జరిగింది. సమావేశంలో పట్టణాభివృద్ధి, మంచినీటి సమస్యపై చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎండకాలంలో నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. కేసీ కెనాల్ సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను నింపాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ వాటర్ సరఫరా కాంట్రాక్టర్ పైపులైన్ లీకేజీలను పట్టించుకోకపోతే రద్దు చేసేందుకు నివేదిక తయారు చేయాలన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ రబ్బాని, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు గఫార్, మెప్మా శాంత కుమారి తదితరులు పాల్గొన్నారు.

జీతభత్యాలు పెంచాలి

నందికొట్కూరు: మున్సిపాలిటిలో పని చేసే రోజు వారీ కూలీలకు జీతభత్యాలు పెంచాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి నరసింహులు, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు మజీద్ మియ్యా డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని జై కిసాన్ పార్కులో జరుగుతున్న సాధారణ సమావేశం సమయంలో డైలీవేజ్ కార్మికులకు వేతనాలు పెంచాలంటూ ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ రోజు వారీ పారిశుద్ధ్య కార్మికులకు నెలకు రూ.9,600 మాత్రమే జీతం ఇస్తున్నారని, ఇది కుటుంబ పోషణకు ఏ మాత్రం సరిపోవడం లేదన్నారు. అనంతరం ఎమ్మెల్యే జయసూర్యకు, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డికి, కమిషనర్ బేబికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు గోపాల్, చూరిబ్, గోవిందు, శేఖర్, తిప్పన్న, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత రుణాలకు దరఖాస్తు చేసుకోండి

ఆత్మకూరు/బండి ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గంలో వెనుకబడిన తరగతులకు చెందిన నిరుద్యోగులు వ్యక్తిగత రుణాల కోసం దరఖాస్తుచేసుకోవాలని ఆత్మకూరు, బండి ఆత్మకూరు ఎంపీడీఓలు నాగభూషణంశెట్టి, దస్తగిరి తెలిపారు. బీసీ, ఈబీసీ, రెడ్డి, వైశ్య కులాలకు చెందిన వారు 21 నుంచి 60 సంవత్సరాల్లోపు వయస్సు ఉన్న వారు ఓబీఎంఎంఎస్ ద్వారా వ్యక్తిగత రుణాల కోసం ఫిబ్రవరి 7వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు.

మహానంది అభివృద్ధికి నూతన మాస్టర్‌ప్లాన్



మాస్టర్‌ప్లాన్‌ను వివరిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

మహానంది: భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని మహానంది దేవస్థానం అభివృద్ధికి సుమారు రూ. 600 కోట్లతో చేపట్టాల్సిన పనులతో నూతన మాస్టర్‌ప్లాన్ రూపొందించామని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి తెలిపారు. గురువారం మహానంది నుంచి వ్యవసాయ కళాశాల వరకు రూ.7.48 కోట్లతో మూడు కిలోమీటర్ల మేరకు తారు రోడ్డు నిర్మాణం, పాలేరు వాగుపై వంతెన నిర్మాణాల కోసం భూమిపూజ చేశారు. అనంతరం దేవస్థానం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీశైలం తరహాలో రింగ్‌రోడ్డు ఏర్పాటు చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకం ప్రసాద్ స్కీం ద్వారా నిధులు వచ్చేలా కృషి చేసి, టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని, ఏఈఓ మధు, సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోండి



మాట్లాడుతున్న ఎక్సైజ్ ఏఎస్పీ రాయుడు

ఆత్మకూరు: వైన్ షాపుల ఏర్పాటుకు ఈడిగ(గౌడ్) కులస్తుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ ఏఎస్పీ రాయుడు తెలిపారు. గురువారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో జిల్లాలో మద్యంషాపుల ఏర్పాటుకు 11 దుకాణాలకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందన్నారు. డివిజన్ పరిధిలో ఆత్మకూరు, కొత్తపల్లి, పాములపాడు మండలాల్లో నూతన షాపులను ఈడిగ, గౌడ్ కులస్తులకు కేటాయించినట్లు తెలిపారు. ప్రస్తుతం తాము ఆన్‌లైన్ లేదా నేరుగా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఫిబ్రవరి 5వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని, 6వ తేదీన పరిశీలిస్తామని, 7వ తేదీన లక్కీ డ్రిప్ ద్వారా జిల్లా కేంద్రంలో ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఎక్సైజ్ సీఐ కిశోర్‌కుమార్, ఎస్‌ఐలు జగదీష్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: మూడు మద్యం షాపులు కేటాయించినట్లు ఎక్సైజ్ ఏఎస్పీ రాయుడు తెలిపారు. గురువారం పట్టణంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నందికొట్కూరు ఎక్సైజ్ శాఖ పరిధిలో నందికొట్కూరు టౌన్, పగిడ్యాల మండలం, జూపాడుబంగ్లా మండలానికి ఒక్కొక్కటి చొప్పున షాపులు కేటాయించినట్లు తెలిపారు.

భక్తులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు



దేవదాయశాఖ సిబ్బందితో ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎస్‌ఐ, రెవెన్యూ సిబ్బంది

కొత్తపల్లి: ఫిబ్రవరి 2వ తేదీన కొలనుభారతి క్షేత్రానికి వసంత పంచమి వేడుకలకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకున్నామని తహసీల్దార్ ఉమారాణి, ఎస్‌ఐ ఎం.కేశవ అన్నారు. గురువారం మండల పరిధిలోని శివపురం గ్రామ శివారులోని కొలనుభారతి క్షేత్రంలో వసంత పంచమి ఏర్పాట్లను సర్పంచు చంద్రశేఖర్ యాదవ్, ధర్మకర్తల మండలి చైర్మన్ వెంకటనాయుడులతో కలిసి పరిశీలించారు. వారు మాట్లాడుతూ భక్తులకు తాగునీరు, భోజనాలు, క్యూలైన్లు, విద్యుత్ సరఫరా, మూత్రశాలలు, మహిళలకు దుస్తులు మార్చుకునేందుకు రూంలు, వాహనాలకు పార్కింగ్ స్థలం, ట్రాఫిక్ నియంత్రణ, అక్షరాభ్యాసాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఛారఘోషిని నది పూడికతీత పనులు పరిశీలించి ఆలయ పరిసరాలు, సప్తశివాలయాల వద్ద పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహమ్మద్ జుబేర్, మండల సర్వేయర్ అనూష రాణి, పంచాయతీ కార్యదర్శి అజ్మతున్నీసా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



వాహన డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న శ్రీశైలం సీఐ జి.ప్రసాదరావు

శ్రీశైలంటెంపుల్: వాహనాల డ్రైవర్లు తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలను పాటించాలని సీఐ జి.ప్రసాదరావు అన్నారు. గురువారం శ్రీశైలంలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు, రాబోయో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల దృష్ట్యా శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జీపు డ్రైవర్లకు, ఆటో డ్రైవర్లకు, వాహన యజమానులకు రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ యాత్రికుల పట్ల మంచి ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపరాదని సూచించారు. కార్యక్రమంలో శ్రీశైలం ఒకటవ పట్టణ పోలీసులు అమర్‌నాథ్‌రెడ్డి, రఘునాథుడు, శంకర్, రాజేంద్రకుమార్, మహాబాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ బాటలో నడవాలి



శ్రీశైలం ప్రాజెక్ట్ కాలనీలో గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

నందికొట్కూరు: మహాత్మాగాంధీ బాటలో నడవాలని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు నాగసత్యనారాయణ అన్నారు. గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం పట్టణంలోని ప్రధాన రహదారిపై ఉన్న విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం నాయకులు, మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కమిషనర్ బేబి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆత్మకూరు: పట్టణంలోని రైతుసేవా సంఘం కార్యాలయంలో గురువారం జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి వేడుకలను రైతుసేవా సంఘం గౌరవాధ్యక్షులు మోమిన్ మునీర్‌బాషా, బైరాపురం బ్రదర్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రైతు సంఘం నాయకులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రాజెక్ట్ కాలనీలోని వాసవీ కన్యాకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో ఉన్న గాంధీజీ విగ్రహానికి శ్రీశైలం మండల ఆర్యవైశ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

బండి ఆత్మకూరు : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పరిపాలనా అధికారి శ్యామల ఆధ్వర్యంలో గాంధీజీకి నివాళులర్పించారు.

పారా లీగల్ వలంటీర్స్ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

నందికొట్కూరు: పారా లీగల్ వలంటీర్స్ నియామకం కొరకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా జడ్జి కబర్ధి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పాసైన వారు పారా లీగల్ వలంటర్స్ నియామకానికి దరఖాస్తులు చేసుకోవడానికి ఈ నెల 31వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే సమయం ఉందని చెప్పారు. సామాజిక సేవ, చట్టంపై అవగాహన, ప్రజా సంక్షేమానికి అంకితభావం ఉన్న వ్యక్తులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు నందికొట్కూరు మండల నివాసి అయి ఉండాలన్నారు. పూరించిన దరఖాస్తు నందికొట్కూరు మండల లీగల్ సర్వీసెస్ కమిటీకి స్వయంగా, పోస్టు ద్వారా పంపించాలని తెలియజేశారు.

ఎర్రగూడూరులో అండర్‌పాస్ వంతెన వద్దు

పాములపాడు: మండలంలోని ఎర్రగూడూరు గ్రామంలో ఎన్‌హెచ్340సీ రోడ్డు నిర్మాణంలో భాగంగా తమ గ్రామం వద్ద అండర్‌పాస్ వంతెన నిర్మించవద్దని గ్రామస్తులు కోరారు. గురువారం గ్రామానికి వచ్చిన ఎన్‌హెచ్ 340సీ రోడ్డు ప్రాజెక్టు డైరెక్టర్ పద్మ గ్రామానికి వచ్చారు. గతంలో గ్రామానికి చెందిన కొంత మంది గ్రామంలో అండర్‌పాస్ వంతెన నిర్మించాలని వినతిపత్రం ఇవ్వడంతో అభిప్రాయ సేకరణకు వచ్చినట్లు తెలిపారు. ఈ విషయమై గ్రామంలో చాలారోజులుగా భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయని ప్రజలు ఆమెకు తెలియజేశారు. కాగా యథావిధిగా తమకు అందిన డిజైన్ ప్రకారంగానే రహదారి నిర్మాణం చెప్పాలని గ్రామస్తులు ఆమెకు తెలియజేశారు.

కొనసాగిన క్రీడలు

మహానంది: మహానంది వ్యవసాయ కళాశాలలో గురువారం రెండో రోజు క్రీడా పోటీలు కొనసాగాయి. రాష్ట్రంలోని 20 పాలిటెక్నిక్ కళాశాలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. 100 మీటర్స్ పరుగు పందెం, లాంగ్ జంప్, డిస్కస్‌త్రో, షాట్‌పుట్, చెస్ పోటీలు పూర్తయ్యాయి. పలు ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పోటీల విజేతల వివరాలను శుక్రవారం వెల్లడిస్తామని ఆఫీసర్ ఇన్‌చార్జ్ ఆఫ్ స్టూడెంట్ ఆక్టివిటీస్ డాక్టర్ ఎల్.వి.విజయభాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైల క్షేత్రంలో 'స్వచ్ఛసేవ'



పారిశుద్ధ్య పనులు చేస్తున్న దేవస్థాన ఈఓ, అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో పారిశుద్ధ్య స్వచ్ఛసేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం క్షేత్ర పరిధిలోని పలు ప్రాంతాలలో విస్తృత పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. ముందుగా రథశాల నుంచి పెద్దసత్రం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో క్యూకాంప్లెక్స్, విరాళాల సేకరణ కేంద్ర ప్రాంగాణం, పలు ప్రధాన రహదారులు, ఆలయ మాడవీధులు, అన్నప్రసాద వితరణ భవన పరిసరాలు తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో దేవస్థాన ఈఓ ఎం.శ్రీనివాసరావు, డీఈఓ రమణమ్మ, ఈఈ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈఓను కలిసిన తెలుగు విశ్వవిద్యాలయం పీఠాధిపతి

శ్రీశైలంటెంపుల్: చరిత్ర సంస్కృతి, పురావస్తు శాస్త్ర పీఠం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పీఠాధిపతి డా.ముసుగు శ్రీనివాసరావు, సిబ్బంది గురువారం శ్రీశైలం దేవస్థాన పరిపాలన భవనంలోని ఈఓ చాంబర్‌లో శ్రీశైల దేవస్థాన ఈఓ ఎం.శ్రీనివాసరావును మర్యాద పూర్వకంగా కలిశారు. తెలుగు విశ్వవిద్యాలయం 2025క్యాలెండర్‌ను ఈఓకు అందజేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.వి. విశ్వనాథశాస్త్రి, డా.పి.మురళీధర్‌రెడ్డి, మ్యూజియం కన్సర్వేటర్ సి.రమేష్‌బాబు తదితరులు ఉన్నారు.